క్లుప్తంగా

దాహం తీర్చేందుకు పైపులైన్



పైపులైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణ ప్రజల దాహం తీర్చేందుకు శుక్రవారం 17వ వార్డులో బోరు వేయడంతో సమృద్ధిగా నీరు పడ్డాయి. బోరుకు పైపులైన్ అనుసంధాన పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిబాబా పేట, హాజీనగర్ ప్రజల దాహం తీర్చేందుకు బోరు వేశామన్నారు.

గడ్డివామి దగ్ధం



కాలిపోతున్న పశుగ్రాసం

జూపాడుబంగ్లా: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మండలంలోని 80బన్నూరు గ్రామంలో పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన చాకలి రామచంద్రుడు ఎద్దులు, పశువుల కోసం రూ.2లక్షలు వెచ్చించి ఐదు ఎకరాల వరిగడ్డి, ఐదు ఎకరాల మినుము పొట్టు కొనుగోలు చేశాడు. పశుగ్రాసాన్ని కల్లంలో వామి వేశాడు. శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు యత్నించటంతో పాటు ఆత్మకూరు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటినా ఘటనా ప్రాంతానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు.

రేపు ఇస్కాల, బానకచెర్లలో సుధీర్ దారా పర్యటన

పాములపాడు: ఈ నెల 31న ఇస్కాల, బానకచెర్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ దారా పర్యటించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీకి ఓటేయమని ప్రజలను కోరనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన పాలసాల పద్మావతి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు నగదు అందజేశారు. దాత కుటుంబానికి స్వామివారి శేషవస్త్రాలను, లడ్డుప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఏప్రిల్ 1న కబడ్డీ పోటీలు

పాములపాడు: ఈస్టర్ సందర్భంగా మండలంలోని వేంపెంట గ్రామంలో ఏప్రిల్ 1న సీనియర్ ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భాస్కర్, శ్యామ్ శుక్రవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30,000 (దాత శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి), రెండవ బహుమతి రూ.20,000 (దాత వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్), మూడవ బహుమతి రూ. 15,000(దాత జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి), నాల్గవ బహుమతి రూ.10,000(దాత తుమ్మలూరు సర్పంచు వరప్రసాదరావు) ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీలు ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 8790408681, 8125491828, 9014716286, 9963588173 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు



జీఎం గిరిధర్ దంపతులను ఆశీర్వదిస్తున్న పండితులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఎస్‌పీసీఐ చీఫ్ ఆఫ్ ఆల్ డీటీటీ, సెంట్రల్, స్టేట్ ప్రొడక్ట్స్ జీఎం గిరిధర్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మహానందికి వచ్చారు. వారికి డిప్యూటీ తహసీల్దార్ సత్యశ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ నాగభూషణం స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



సీఎస్ఐ చర్చి ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

నందికొట్కూరు: గుడ్ ఫ్రైడే వేడుకలను నియోజకవర్గంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నందికొట్కూర్ సీఎస్ఐ, ఏబీఎం, హోసన్న, ఆర్‌సీఎం, సీయోను తెలుగు బాప్టిస్టు తదితర చర్చిలకు క్రైస్తవులు భారీగా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల పాస్టర్లు గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ మైఖేల్ శ్యాంసుందర్ బాబు మాట్లాడుతూ ఏసు పాపులను కాపాడేందుకు సిలువ మరణం పొందారన్నారు. ప్రేమ, త్యాగం, క్షమా గుణమే క్రీస్తు చూపిన జీవన మార్గమన్నారు. ప్రతిఒక్కరూ ఏసు చూపిన మార్గంలో నడవాలని కోరారు. సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి అమల్‌రాజు, ఏబీఎం సంఘం, ఆర్‌సీఎం సంఘం, ఆయా సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

➡ జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు, మండ్లెం, తంగడంచ, భాస్కరాపురం, తూడిచెర్ల, పారుమంచాల, తరిగోపుల, పి.లింగాపురం, 80బన్నూరు, పోతులపాడు గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఉప్పలదడియ ఆర్‌సీఎం చర్చి నుంచి శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

➡ మిడుతూరు: మండలకేంద్రంతోపాటు ఉప్పలదడియ, కలమందలపాడు, మాసపేట, 49-బన్నూరు, కడుమూరు, తలముడిపి, చెరుకుచెర్ల, వీపనగండ్ల తదితర గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉప్పలదడియ ఆర్‌సీఎం చర్చి నుంచి విచారణ గురువులు మధుబాబు ఆధ్వర్యంలో శిలువను మోసుకుంటూ క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ దిగువపాడు కల్వరికొండ వరకు యాత్ర నిర్వహించారు. అక్కడ నాటక ప్రదర్శన ద్వారా గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బ్రదర్లు కోమాస్, జగదీష్ పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ మైఖేల్ శ్యాంసుందర్‌బాబు

➡ పగిద్యాల: గుడ్ ఫ్రైడే వేడుకలను మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఏబీఎం చర్చిలో ఫాస్టర్ రెవరెండ్ యోహాన్ గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు.

➡ పాములపాడు: దైవ సందేశంతో జాతికి శాంతి సందేశం ఇస్తూ ఏసు క్రీస్తు శిలువ ఎక్కిన రోజు గుడ్ ఫ్రైడే ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

➡ కొత్తపల్లి: మండలంలో అన్ని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ప్రార్థన మందిరాల్లో ఏసుక్రీస్తు శిలువ శ్రమలపై ప్రత్యేక పార్థనలు చేశారు. గువ్వలకుంట్ల, కొత్తపల్లి, లింగాపురం, శివపురం, సింగరాజు పల్లె, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లోని సీఎస్ఐ సంఘాలలో సీఎస్ఐ సంఘ మండల పాస్టేట్ చైర్మన్ భరత్‌దివాకర్ బాబు, గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లి, గుమ్మడాపురం గ్రామాల్లో రోమన్ క్యాథలిక్ సంఘం ఫాదర్ బేర్నార్డ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



సర్పంచ్ రవియాదవ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గ్రామస్తులు

నందికొట్కూరు రూరల్: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బిజినవేముల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారిని రవి యాదవ్ సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకుందామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు రఫి, నూర్‌బాషా, శాలుబాషా, యాకూబ్, షబ్బీర్, రహీం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అంకాళమ్మకు విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

నేడు సున్నిపెంటలో 'ఆరోగ్య సురక్ష శిబిరం'

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామసచివాలయం-1 వద్ద శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పంచాయితీ కార్యదర్శి బాలూనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలున్న ప్రతిఒక్కరూ శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందాలన్నారు.

ఉపవాసదీక్షలతో గుడ్‌ఫ్రైడే

శ్రీశైలంప్రాజెక్ట్: ఏసుక్రీస్తు మానవాళి పాపాల నిమిత్తం శిలువలో తన రక్తాన్ని చిందించి మరణించిన శుభ శుక్రవారాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు ఉపవాసాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుడు తన మరణానికి ముందుగా పలికిన ఏడు మాటలను మననం చేసుకున్నారు. శ్రీశైలమాత చర్చి పాస్టర్, సహవాసులు శిలువధారి ఇతివృత్తాన్ని శ్రీశైలంప్రాజెక్ట్ పురవీధులలో నిర్వహించారు. శిలువను భుజానమోస్తు, 'కలువరిగిరిలో శిలువ ధారివై వేలాడితివా..నా యేసయ్య' గీతాన్ని ఆలపిస్తూ ప్రదర్శన కొనసాగించారు.

➡ ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ ప్రార్థనా మందిరం, ఎస్పీజీ పాలెం, ఏబీఎం పాలెం, ప్రార్థనా మందిరాలతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో క్రైస్త వులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువ మోయడం వల్ల ఆయనకు గుర్తుగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటున్నారు.

➡ వెలుగోడు: ఏసుక్రీస్తు శిలువ మరణాన్ని గుర్తు చేసుకుంటూ శుక్రవారం మండలంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పరిశుద్ధ యోహాన్ సీఎస్ఐ ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రాజేంద్రబాబు దైవ సందేశాన్ని వినిపించారు. 2 వేల ఏళ్ల క్రితం ఏసుక్రీస్తు మానవ రూపంలో ఈ లోకానికి వచ్చారని, ఆయనలో ఏ పాపం లేదని, మనుషులు చేసిన పాపాలను ఆయన భరించి శిలువ మానుపై రక్తం కార్చి ప్రాణం అర్పించారని తెలిపారు. సమాధి చేయబడి మూడో దినం తిరిగి లేచారన్నారు. మానవుల పాపాలను, శాపాలను తొలగించిన దేవుడిని ఆత్మతో, సత్యంతో ఆరాధించాలని బోధించారు. ప్రార్థనల్లో కమిటీ సభ్యులు ఏర్వ శ్యామలమ్మ, పెద్దలు ఏర్వ లోకన్న, జ్ఞానైదం, సునీల్, గొడుగు నాగరాజు పాల్గొన్నారు.



శ్రీశైలం ప్రాజెక్ట్‌లో క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు



వెలుగోడు సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బాధితులకు సిద్ధార్థరెడ్డి పరామర్శ



గాయపడిన వారితో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పాములపాడు: ఈనెల 28న జిల్లా కేంద్రంలో జరిగిన మేమంతా సిద్ధం సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో జూటూరు గ్రామానికి చెందిన 25 మంది స్వల్పంగా గాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు క్షతగాత్రులకు ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్సలు చేయించి గ్రామానికి పంపారు. విషయం తెలుసుకున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి శుక్రవారం బాధితులను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి కూడా రూ.10 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు నాయిని సావిత్రమ్మ, మండల కార్యదర్శి మధుసూదన్‌రావు, తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

27 ఏళ్లుగా మహానందీశ్వరుడి సన్నిధికి

- మొదట మహానంది, తర్వాత శ్రీశైలం
- పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తులు



మహానందిలో భజనలు చేస్తున్న మైసూరు భక్తబృందం

మహానంది: కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన మైసూర్ అమ్మణ పరసే మైలాల గోచార్ సంస్థకు చెందిన భక్తులు 27 ఏళ్లుగా మహానంది, శ్రీశైలం ఆలయాలకు వస్తూ భక్తిని చాటుకుంటున్నారు. సర్వేజనా సుఖినోభవంతు అంటూ ఆ భక్తులు చేస్తున్న పాదయాత్ర అభినందనీయం. శుక్రవారం వారు మహానందికి చేరుకున్నారు. వివిధ రకాల వాయిద్యాలతో శివనామస్మరణ చేస్తూ పూజలు చేశారు. ఉగాది యాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తూ గత 27 ఏళ్ల నుంచి మహానందికి వస్తున్నామని, ముందుగా మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి అనంతరం శ్రీశైలం వెళ్తామని చెప్పారు. శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని పాదయాత్రగా స్వస్థలానికి చేరుకుంటామని చెప్పారు. మహానంది దేవస్థానం ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, తదితరులు వారిని అభినందించి ఆశీర్వచనాలు చేశారు.

ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలి

- ఈఓ డి.పెద్దిరాజు



దుకాణదారులతో మాట్లాడుతున్న ఈఓ డి.పెద్దిరాజు, సీఐ ప్రసాదరావు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల క్షేత్ర పరిధిలోని దుకాణదారులు ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డి.పెద్దిరాజు సూచించారు. శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో క్షేత్ర పరిధిలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షల సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. దుకాణదారులు భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. దుకాణదారులు, హోటల్ నిర్వాహకులు శుచీ, శుభ్రతలను పాటించాలన్నారు. ఆహార పదార్థాలపై, తినుబండరాలపై తప్పనిసరిగా మూతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద వస్తువుల ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీశైలం ఎస్ఐ లక్ష్మణరావు, దేవస్థాన రెవెన్యూ ఏఈఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ నుంచి పడి మహిళ మృతి

జూపాడుబంగ్లా: జోగులాంబ గద్వాల జిల్లాలోని మరకల్ వద్ద బైక్‌పై నుంచి కిందపడి జూపాడుబంగ్లాకు చెందిన జంగాల మాధవి(24) మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు... జూపాడుబంగ్లాకు చెందిన జంగాల మాధవి, భర్త బాలరాజు యాచక వృత్తితో పాటు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ సంచార జీవనం చేసేవారు. అందులో భాగంగా వారు జోగులాంబ గద్వాల జిల్లా మరకల్ గ్రామ సమీపంలో గుడారాలు వేసుకొని జీవిస్తున్నారు. శుక్రవారం మాధవి ఆమె తమ్ముడు కలిసి ద్విచక్రవాహనంపై వ్యాపారం ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడింది. తలకు తీవ్రగాయాలు కావటంతో చికిత్స నిమిత్తం 108లో తరలిస్తుండగా మృతిచెందింది. భర్త ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించటంతో వారు జూపాడుబంగ్లాలో అంత్యక్రియలు నిర్వహించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పగిద్యాల: పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. నెహ్రూనగర్‌కు చెందిన బోయ గోపాల్‌నాయుడు(45), లింగమ్మ దంపతులకు నాగమణి, గౌతమి సంతానం. నాగమణికి పెళ్లి చేసి అత్తారింటికి పంపారు. గోపాల్ నాయుడు మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్య రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. చెడు వ్యసనాలకు బానిసై ఆరు ఎకరాల భూమిని విక్రయించాడు. ఇంకా రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఇటీవల చిన్న కూతురి పెళ్లి నిమిత్తం ఉన్న రెండెకరాలను విక్రయించేందుకు యత్నించగా తల్లిదండ్రులు అడ్డుకున్నారు. దీంతో మనస్తాపం చెంది నాలుగు రోజుల క్రితం పొలం గట్లకు కొట్టే గడ్డి మందు తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడా కోలుకోలేక మృతి చెందాడు. ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వారికి విధులు కేటాయించొద్దు

నంద్యాల(న్యూటౌన్): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, కార్యదర్శి నగరి శ్రీనివాసులు ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే నెలలో జరిగే సాధారణ ఎన్నికల విధుల నుంచి పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులు, చంటి బిడ్డ తల్లులు, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మాధవస్వామి, సాంబశివుడు, పుల్లయ్య, పవన్‌కుమార్, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, జయరాం, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

చాగలమర్రి: వీధి కుక్కల దాడిలో 13 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన శుక్రవారం గొడిగనూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మబ్బు వీరన్న అనే రైతు గొర్రెలను ప్రతి రోజులాగే మేపుకొని తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో ఒక్కసారిగా వీధి కుక్కల గుంపు గొర్రెల మందపై దాడి చేశాయి. దాడిలో సుమారు 13 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్ఐ హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం రాత్రి ముసలిమడుగు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఎన్నికల నియమాలను వివరించారు. అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు పాల్పడినా, అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మరోసారి ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్



తలముడిపి గ్రామంలో ప్రచారం చేస్తున్న డాక్టర్ దారా సుధీర్

మిడుతూరు: ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆపార్టీ నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ, మైనార్టీ, బీసీ కాలనీల్లో ప్రజలను కలిసి జగనన్న పాలనలో అందిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజలకు సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అందరినీ ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి జగనన్న పెద్ద పీట వేశారని, అవ్వా, తాతలకు ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్లు ఇచ్చారని అన్నారు. ఇవన్నీ కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, పోచా బ్రహ్మానందరెడ్డిని నంద్యాల ఎంపీగా గెలిపించి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత అలగనూరు రిజర్వాయర్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ పర్వత యుగంధర్ రెడ్డి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు నాగారెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వర రెడ్డి, ఎంపీటీసీ స్వామన్న, సర్పంచ్‌లు పేరెడ్డి వెంకటరామిరెడ్డి, నాగస్వామిరెడ్డి, ఫణిభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారాంభట్, హనుమంతు శర్మ, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామివారి పల్లకీని మోస్తూ ఓం నమో మహానందీశ్వరాయ అంటూ భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.